విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను సోమవారం నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఐడీపీఎల్ సబ్ స్టేషన్ టీఐఈ బాలానగర్ ఫీడర్ పరిధిలో టీఐఈ బాలానగర్, వాషింగ్ సెంటర్, సత్య ఇంజనీరింగ్, శ్రీ బాలాజీ పౌడర్ కోటింగ్స్ , రాయల్ ఇంజినీరింగ్ వర్క్స్, క్వాలిటీ ఐస్ క్రీమ్స్, ఐటీ లిమిటెడ్, ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ప్రశాంత్ నగర్ సబ్ స్టేషన్ గణేష్ కాంటా ఫీడర్ పరిధిలో ప్రశాంత్‌నగర్, గణేష్ కాంటా, ఎంకే టూల్స్, కూకట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్ : సీపీఎం


రైతు బజారులో కరపత్రాలు పంచుతున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

కుత్బుల్లాపూర్: కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. ఈ నెల 10న ఇందిరా పార్కు వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే బడ్జెట్‌పై నిరసన కార్యక్రమ కరపత్రాలను ఆదివారం షాపూర్‌నగర్ మార్కెట్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. ఈ బడ్జెట్‌తో పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో అంజయ్య, తిమ్మప్ప, సాధులు, ప్రసాద్, మధు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు

యూజీడీ, సిమెంట్ రోడ్డు నిర్మాణం చేయరూ..


గుంతలో నిలిచిన మురుగునీరు

జీడిమెట్ల: మట్టిరోడ్డు ఉన్న చోట సిమెంట్ రోడ్డు నిర్మించడంతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. సుభాష్‌నగర్ డివిజన్ రాంరెడ్డినగర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని సూపర్‌గ్యాస్ రోడ్డులో గత సంవత్సరకాలంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నుంచి మురుగునీరు లీక్ అయి రోడ్డుపై పారుతుంది. దీనికి తోడు రోడ్డు గుంతగా మారడంతో మురుగునీరు గుంతలో నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని భూగర్భ డ్రైనేజీ నిర్మాణంతో పాటు సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన సాయిబాబా ఆలయ వేడుకలు


వ్రతంలో పాల్గొన్న భక్తులు

మోతీనగర్: సద్గురు సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వేడుకల్లో భాగంగా రెండవ రోజు కాగడ హారతి, శతకటాభిషేకం, అలంకరణ, అర్చన, సామూహిక శ్రీ సత్యదేవుని వ్రతం, మధ్యాహ్నం హారతి, అన్న సమారాధన, సంధ్యా హారతి, విష్ణు సహస్రనామ పారాయణం, భజన, పల్లకీ సేవ తదితర పూజలు నిర్వహించారు.

రాందేవ్‌రావ్ హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం



ఆల్విన్‌కాలనీ: రాందేవ్‌రావ్ హాస్పిటల్‌లో మెడ, వెన్ను నొప్పి, స్పైన్‌కు సంబంధించిన మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. వైద్య శిబిరంలో సుమారు 400 మంది మెడ, వెన్ను నొప్పి సమస్యలతో బాధపడుతున్న వారికి ఎంఆర్ఐ, సీటీ, ఇతర పరీక్షలు ఉచితంగా చేశారు. క్యాంపును ప్రముఖ రేఖీ థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మీ కమలాకర్ ప్రారంభించారు. రాందేవ్‌రావ్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కే. కమలాకర్ ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ హిమాన్షు ఆర్ ప్రసాద్ వెన్నుపూస సమస్యలతో బాధపడుతున్న రోగులకు చికిత్స, వైద్య సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్ సుంకర, డాక్టర్ పవన్, డాక్టర్ మనికుమార్, డాక్టర్ జుబేర్, డాక్టర్ సత్యనారాయణ, భవానంద్, విక్రమ్‌దేవ్‌రావు, మీరారావ్, అపర్ణరావ్, ప్రశాంత్‌రెడ్డి, అడ్మిన్ మేనేజర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్నం 3 అయితే చాలు..
ఖాళీ కుర్చీలే దర్శనం!

ఉన్నతాధికారుల నిఘా లోపం.. స్థానిక అధికారుల అండదండలు వెరసి తాము ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా తయారైంది కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయ సిబ్బంది పని తీరు. ప్రజావాణి ఉండే సోమవారం రోజు కూడా సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం విధులకు హాజరై 3 అయ్యిందంటే చాలు కార్యాలయంలో ఎవరూ కనిపించరు. ఖాళీ కుర్చీలే దర్శనమిస్తాయి. బయోమెట్రిక్ కూడా పని చేయకపోవడంతో వారు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- విధులకు ఇష్టానుసారంగా కుత్బుల్లాపూర్ జలమండలి సిబ్బంది
- పనిచేయని బయోమెట్రిక్
- విధులకు హాజరుకాకున్నా హాజరైనట్లు సంతకాలు!
- పట్టించుకోని అధికారులు



చింతల్ : సాధారణంగా ఏ ప్రభుత్వ కార్యాలయమైన ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. కానీ జలమండలి కార్యాలయంలో ఒక్కొక్క రోజు ఉదయం 11 కావస్తున్న ప్రధాన కార్యాలయంతో పాటు డీజీఎం, సెక్షన్ కార్యాలయాలకు తాళాలు తీసేవారు కూడా ఉండరు. వివిధ సమస్యలపై సదూర ప్రాంతాల నుంచి వచ్చే వినియోగదారులకు కార్యాలయాలు మూసి ఉండటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. కొంత మంది సిబ్బంది మధ్యాహ్నం 1:30, 2 గంటల వరకు విధులకు హాజరవుతున్నారు. మరి కొంతమంది సిబ్బంది మధ్యాహ్నం రెండు గంటలకు భోజన కార్యక్రమాలు పూర్తికాగానే మూడు గంటలకల్లా సిబ్బందితో పాటు అటెండర్లు సైతం తమ విధులు పూర్తికాకుండానే తిరుగు ప్రయాణం అవుతున్నారు. ఇందులో జలమండలి ప్రభుత్వ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఏమాత్రం తేడా లేకుండా వారి సమయాలు పూర్తి కాకుండానే విధులను ముగిస్తున్నారు.

కొన్నేళ్లుగా పనిచేయని బయోమెట్రిక్

జలమండలి 2016లో ఒకసారి 2018 లో మరోసారి బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేసింది. అనంతరం కరోనా ప్రభావంతో ఈ బయోమెట్రిక్ మిషన్ల ద్వారా హాజరు నమోదు కార్యక్రమాన్ని తొలగించడంతో రిజిస్టర్‌కి పరిమితమై వేతనాలు చెల్లిస్తున్నారు. కరోనా ప్రభావం తగ్గిన అనంతరం 2022 నుంచి మరల ఇప్పటి వరకు బయోమెట్రిక్ మిషన్ల సంగతే మర్చిపోయారు. ఔట్ సోర్సింగ్ వారు సెలవులు తీసుకుని ఎన్ని రోజులు విధులకు హాజరైతే అన్ని రోజుల వేతనం తీసుకుంటున్నారు. జలమండలిలో పని చేస్తున్న సిబ్బంది మాత్రం సెలవులు ఎన్ని తీసుకున్నా హాజరు మాత్రం 30 రోజులు హాజరవుతున్నట్లు పంపుతున్నారని సమాచారం. డీజీఎంలు, ఆయా సెక్షన్ కార్యాలయాలు పంపింగ్ కేంద్రాల వద్ద బయోమెట్రిక్ మిషన్లు ఉన్నప్పటికీ అవి శిథిలావస్థకు చేరాయి. మరి కొన్ని చోట్ల బయోమెట్రిక్ మిషన్లు ఉండే చోట ఖాళీ డబ్బాలే దర్శనమిస్తున్నాయి. దీంతో కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలోని జీఎం కార్యాలయం నుంచి డీజీఎం కార్యాలయాలు, వివిధ సెక్షన్ల కార్యాలయం వద్ద ఉన్న బయోమెట్రిక్ మిషన్ల ద్వారా హాజరు నమోదు లేదు. వివిధ సెక్షన్ మేనేజర్లు, వారి అసిస్టెంట్లు, డివిజన్ కార్యాలయంలో పని చేసే సిబ్బంది, కార్యాలయంలో పని చేస్తున్న అటెండర్లు సైతం మధ్యాహ్నం మూడు గంటల తర్వాత కనిపించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పనిచేయని బయోమెట్రిక్ యంత్రం

సక్రమంగా పని చేసేలా చర్యలు

కొంతమంది సిబ్బంది మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లిపోతున్నారని తెలిసింది. ఉదయం కూడా ఆలస్యంగా విధులకు హాజరవుతున్న వారిని హెచ్చరించాం. సాయంత్రం 5 గంటల వరకు కూడా ప్రతి ఉద్యోగి, సిబ్బంది విధులు నిర్వహించాల్సిందే. సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– అశోక్,
జనరల్ మేనేజర్, జలమండలి కుత్బుల్లాపూర్

మెరుగైన సేవలందించాలి


శ్రీశైలంగౌడ్‌తో మున్సిపల్ కమిషనర్

కుత్బుల్లాపూర్: ప్రజలకు అధికారులు మెరుగైన సేవలందించాలని మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ అన్నారు. దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్ నాయక్ ఆదివారం షాపూర్‌నగర్‌లోని నివాసంలో ఆయన కలిశారు. సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వాటిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు.


వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ఘనంగా ఆలయ 124వ వార్షిక వేడుకలు

నిజాంపేట్ : నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఏనుగుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భ్రమరాంబ మల్లికార్జున రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ 124వ వార్షిక వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. వేడుకలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, మాజీ మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొబ్బా దేవి చందు, పెద్దిరెడ్డి సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్‌రెడ్డి, చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు శివారెడ్డి, దశరథ, ముత్యాలు, స్వామి, ఏనుగుల రాజశేఖర్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద

ధ్యానంతో మనసుకు ప్రశాంతత

రాజయోగ ధాన్యం మన మనసును ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడిని తగ్గించడానికి ముఖ్యమైన సాధనం అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ఆదివారం ప్రగతినగర్ పరిధిలోని రాఘవేంద్ర హోమ్స్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో నూతన రాజయోగ మెడిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించి మాట్లాడారు. సమజాంలో నీతి, శాంతి, సామరస్యాన్ని నెలకొల్పడంలో బ్రహ్మ కుమారీస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, నాయకులు జస్వంత్, సాంబశివారెడ్డి, అజయ్ చౌదరి, స్వామి, భిక్షపతి, ముత్యాలు, అర్పిత ప్రకాష్, లలితారెడ్డి, పద్మ, బ్రహ్మకుమారీస్ దిల్‌రెడ్డి బయ్యు, రాజయోగిని బి.కె. సరోజిని, రాజయోగిని బి.కె.జ్యోతి, గణేష్, నాందేవ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

కుత్బుల్లాపూర్: ప్రమాదవశాత్తు భవనంపై నుండి కింద పడిన చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ విజయవర్ధన్ వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన నజీమ్, పర్వీన్‌లకు నలుగురు సంతానం. ఈ నెల 8వ తేదీన సాయంత్రం 4.45 గంటలకు పెద్ద కుమారుడు అద్నాన్ ట్యూషన్‌కు వెళ్తుండగా చిన్న కుమార్తె సిద్రా ఆనమ్(01) రెండవ అంతస్తు నుంచి అన్నకు టాటా చెప్పేందుకు గ్రీల్స్ పట్టుకుని నిలబడింది. ఈ క్రమంలో కిందకు చూస్తున్న సిద్రా ప్రమాదవశాత్తు కిందకు జారి పడింది. వెంటనే నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14 నుంచి గురుదత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో త్రిమూర్తి స్వరూప గురుదత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నాగిరెడ్డి తెలిపారు. ఈ నెల 14న సాయంత్రం గణపతి పూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీప స్థాపన, గణపతి హోమం, దత్తాత్రేయ స్వామి మూలమంత్ర హోమం, 15న మండప దేవత హోమం, పూజలు, యంత్రస్థాపన, ఉదయం 8.40 గంటలకు స్వామి విగ్రహ ప్రతిష్ఠ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలపై నిరసన

నిజాంపేట్: బాచుపల్లి మండలంలోని నిజాంపేట్ సర్వే నంబర్‌లో 233/21 ప్రభుత్వ స్థలాన్ని దర్జాగా కబ్జా చేస్తున్నారని బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ స్థానికులతో కలిసి సదరు స్థలంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీఓకు సమాచారం ఇవ్వడంతో ఆర్ఐ భాను ప్రసాద్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. నిర్మాణదారుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి ఎన్‌ఓసీ, ఇతర పత్రాలను చూపించాలని అడిగారు. నిర్మాణాదారులు అట్టి పత్రాలను చూపించలేకపోయారు. పనులు మాత్రం కొనసాగించారు. అధికారులు, అధికార పార్టీ నాయకుల అండదండలతోనే కబ్జాలు జరుగుతున్నాయని ఆకుల సతీష్ ఆరోపించారు. నిర్మాణాలపై తహసీల్దార్ పూల్‌సింగ్‌ను వివరణ కోరగా.. అది ప్రభుత్వ స్థలమేనని అన్నారు. ఇన్‌వార్డులో ప్రహరీ నిర్మాణం చేసే వ్యక్తులు పత్రాలు ఇచ్చినట్లు సమాచారం ఉంది. ఏ పత్రాలు ఇచ్చిన ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపడితే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. పనులు నిలిపివేయాలని సదరు వ్యక్తులకు చెప్పామని, నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని హెచ్చరించారు.


ఆర్ఐతో మాట్లాడుతున్న ఆకుల సతీష్

కాలనీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

దుండిగల్: సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్‌లోని కేవీఆర్ కాలనీ వాసులు ఏర్పాటు చేసిన కమాన్‌ను ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ వాసులు ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అభివృద్ధి విషయంలో ఏ సహాయం కావాలన్నా తాను అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొంగునూరి కిషోర్‌రెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, దూసకంటి పద్మారావు, శామీర్‌పేట ప్రకాష్, క్యాసారం సత్యనారాయణ, మహేందర్, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కమాన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి

అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం!

ఆధునీకరణ పేరుతో తొలగించిన బస్ షెల్టర్

రంగారెడ్డినగర్: అధికారుల నిర్లక్ష్యానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంచక్కా ఉన్న బస్ షెల్టర్‌ను ఆధునీకరణ పేరుతో జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించారు. దీంతో గత రెండేళ్లుగా ప్రయాణికులు నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి జగద్గిరిగుట్ట- ఐడీపీఎల్ రోడ్డులోని గాంధీనగర్ బస్‌షెల్టర్‌ను ఆధునీకరించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు. వెంకట్రామిరెడ్డినగర్, గాంధీనగర్, నందానగర్, విజయనగర్‌కాలనీ తదితర ప్రాంతాలతో పాటు గాంధీనగర్ పారిశ్రామికవాడలో పనిచేసే కార్మికులు ఈ బస్టాప్ నుంచే నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. రెండేళ్లుగా బస్ షెల్టర్ పనులు ముందుకు సాగకపోవడంతో స్థానికంగా ఉండే కొందరు కూల్చిన షెల్టర్‌పై కర్రలతో తాత్కాలిక షెడ్డు నిర్మాణాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయమై పలుమార్లు స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు అటు జీహెచ్‌ఎంసీ, ఇటు ఆర్టీసీ అధికారులకు వినతులు అందజేసినా బస్‌షెల్టర్ మాత్రం నిర్మాణానికి నోచుకోవడం లేదు. అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల తాత్కాలిక బస్‌షెల్టర్ కూలడంతో ప్రయాణికులు ఎండలోనే నిలబడాల్సి వస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు కూర్చోడానికి, నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఎప్పుడు కరుణిస్తారో.. ఎప్పుడు బస్ షెల్టర్ నిర్మిస్తారోనని స్థానికులు ఎదురు చూస్తున్నారు.



ఎం.కె స్పోర్ట్స్ క్లబ్‌లో బాస్కెట్‌బాల్ టోర్నమెంట్


విజేతలతో టీవీఆర్ స్కూల్స్ చైర్మన్ కోటిరెడ్డి

జీడిమెట్ల: ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లోని సత్యవాణి విద్యానికేతన్‌లో అండర్ 12, 14 బాలుర, బాలికల విభాగాల్లో ఆదివారం టోర్నమెంట్ నిర్వహించారు. మొత్తం ఇందులో 9 టీంలు పాల్గొన్నాయి. అండర్ 12 బాయ్స్‌లో డ్రాగన్ వారియర్స్ మొదటిస్థానంలో, బాల్‌స్టార్ నింజాస్ రెండో స్థానంలో నిలిచారు. అండర్ 14 బాయ్స్ విభాగంలో నైట్ నింజాస్ మొదటి స్థానం, బ్రూటల్ లెజెంట్స్ రెండో స్థానంలో నిలిచారు. బాలికల అండర్ 14లో హంటర్స్‌టీం మొదటిస్థానం, టైటాన్స్‌టీం రెండో స్థానంలో నిలిచింది. విజేతలకు టీవీఆర్ పాఠశాలల చైర్మన్ కోటిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. ఈ టోర్నమెంట్‌ను ఎం.కె స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చింతల్: కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ 2002-03 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

వైభవంగా కట్టమైసమ్మ జాతర

- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు
- బోనాలు సమర్పించి మొక్కుల చెల్లింపు
- హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

సుభాష్‌నగర్: సూరారంలోని కట్ట మైసమ్మ రేణుకా ఎల్లమ్మ ప్రధాన జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జాతరకు స్థానికంగానే కాకుండా చుట్టు పక్కల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మహిళలు కుటుంబ సమేతంగా బోనాలతో తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. సూరారంలోని ప్రతి ఇంట్లో బంధువులు రాకతో సందడి నెలకొంది. కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమంతరెడ్డి, బీజేపీ నేత మల్లారెడ్డి, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, రావుల శేషగిరి, సురేష్ రెడ్డి, విజయ శేఖర్ గౌడ్ లు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.




భక్తులతో నిండిపోయిన ఆలయ ప్రాంగణం


అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు


పూజలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్